# పరంపర

"అమ్మ కొట్టింది...నాన్నా! అమ్మ కొట్టింది..." లంచవర్లో ఇంటి కొచ్చిన తండ్రి కాళ్ళను పెనవేసుకుంటూ అంది నాలుగేళ్ళ కవిత... రెండు చేతుల్తో కూతుర్ని లేపి చంకకెత్తుకున్నాడు వెంకటయ్య...

"నాన్నా! అమ్మ దోస్త్ కటీఫ్... మనిద్దరమే దోస్త్... ఇక్కడ కొట్టిందమ్మ..." అంటూ చెంప చూపెట్టింది కవిత...

కందిపోయున్న కూతరు చెంప చూసిన వెంకటయ్య ముఖం ఎర్రబడింది... కోపంగా విమల దగ్గరి కెళ్ళాడు...

"బేబీ నెందుకు కొట్టావు...?" అన్నాడా వేశంగా... విమల నవ్వి ఊర్కుంది... రెట్టించడిగాడు... అయినా ఆమె మాట్లాడ లేదు... భార్యను చురచురా చూసాడు... ఆమె నవ్వింది....

"ఉన్న సమయమే తక్కువ... కాళ్ళూ చేతులూ కడుక్కొని అన్నం తినండి..." అని అన్నం వడ్డించడంలో నిమగ్నమయింది విమల... కాళ్ళూ చేతులూ, ముఖం శుభ్రం చేసుకొనొచ్చి భోజనం చేస్తూ కోపంగా భార్య దిక్కు చూసాడు వెంకటయ్య...

"అమ్మాయి నెందుకు కొట్టావు...?" మరో సారడిగాడు

"ముందు భోజనం వెయ్యండి..." అంటూ అక్కడ్నుంచి వెళ్ళి పోయింది విమల. గబగబా భోజనం ముగించి, సమయం లేదు కాబట్టి ఆఫీసు కెళ్ళాడు వెంకటయ్య...

కానీ ఏ పని చేస్తున్నా, ఏ ఫైలు చూస్తున్నా 'అమ్మ కొట్టింది' అన్న కవిత మాటలే వెంకటయ్య చెవుల్లో ప్రతి ధ్వనిస్తున్నాయి... కంది పోయిన చెంపతో ఆ పసిదాని ముఖమే కళ్ళ ముందు కదులుతోంది... విమల పై అతనికి కోపంగా వుంది... పసిదాన్నంత గట్టిగా కొట్టడమే కాకుండా- తానడిగినా జవాబు చెప్పని భార్యపై అతనికి చాలా కోపంగా వుంది...

విమల కవిత నెందుకు కొట్టింది...? పిల్లలు అల్లరి చేస్తారు నిజమే... అంత మాత్రాన చెంప కంది పోయేట్టు కొట్టాలా...? పైగా తానడిగినా చెప్పడం లేదు. అంత పొగరెందుకు విమలకు...? తన మాటంటే లక్ష్యమే లేదు... ఎన్ని సార్లడిగినా నవ్వి ఊర్కుంటుంది.? అసలు విమలకు ఏం చూసుకొని అంత పొగరు...? తన మాటంటే ఎందు కంత నిర్లక్ష్యం...? తనేమన్నా వేలకొద్దీ కట్నం తెచ్చిందా...? కుటుంబం గడవడానికే మైనా సంపాదిస్తుందా...? తానీ సంసారాన్ని ఈదలేక ఈడిగిల బడుతున్నాడు... తాను గుమస్తాగా జాయినయ్యాడు. పదేళ్ళుగా గుమస్తాగానే మిగిలి పోయాడు... కరువు భత్యం, ఇంక్రిమెంట్ల రూపంలో జీతం కొంత కొంత పెరిగినా పెరుగుతున్న ధరలతో తన జీతం ఏ విధంగానూ పోటీ పడడం లేదు. ఎదుగు తున్న పిల్లలు... పెరుగుతున్న ఖర్చులు... ఎదుగూ బొదుగూ లేని జీవితం... జీతం... తనకు తల్లి దండ్రుల నుంచి సంక్రమించిన ఆస్తి కూడా లేదు. కేవలం జీతం తోనే సంసారాన్నీదాలి... తానొక్కడి సంపాదన తోనే కుటుంబం గడవాలి... తనకెన్ని ఆర్థిక ఇబ్బందులున్నా పిల్లలంటే ప్రాణం... పిల్లలు కన్నీరు కారిస్తే తను చూడలేడు. కుటుంబం కోసం ఏ బాధ్యతా తీసుకోకుండా పిల్లలను బాదుతుంది విమల. తననూ సంసారం కొరకు తను పడుతున్న తపననూ అర్థం చేసుకోలేదు. చేసుకోవడానికి ప్రయత్నించడం లేదు. పిల్లలను కొడుతుంది. హింసిస్తుంది... తనకు చెప్పిందని తాను ఆఫీసు కొచ్చింతర్వాత కవితను మళ్ళీ కొడు తుందేమో? విమల రాక్షసి... పిల్లలను చితక కొడ్తుంది. తన నర్థం చేసుకోవడం లేదు. బుద్ధి చెప్పాలి... విమలకు బుద్ధి చెప్పాలి... తగిన బుద్ధి చెప్పాలి ఈసారి పిల్లలను కొట్టకుండా చేయాలి...

పరధ్యానంగా ఆఫీసుపని చేస్తూనే ఎన్నో రకాలుగా ఆలోచించాడు వెంకటయ్య. భార్యను కఠినంగా శిక్షించాలను కున్నాడు... రిస్టు వాచీ చూసుకున్నాడు... ఇంకో అరగంట టైముంది... కానీ, పని చేయడానికి మనసొప్పడం లేదు... ఆఫీసర్ గారి పర్మిషనడిగి బయట పడ్డాడు... సైకిల్ తొక్కుకుంటూ ఇంటి కెళ్ళాడు... వెంకటయ్య ఇల్లు



రాజమండ్రి జెసీరెడ్స్‌వారి పోటీలో రూ. 250లు ప్రథమ బహుమతి పొందిన కథ.

చేరుకునే సరికి కవిత విమల తొడపై కూర్చుని ఏమేమో కబుర్లు చెబుతోంది... ఆమె మధ్యాహ్నం తల్లి కొట్టిన విషయం మరిచి పోయింది... కానీ, కవిత చెప్పిన మాటలు వెంకటయ్య మర్చి పోలేదు... తండ్రిని చూస్తూనే పరుగెత్తుకొచ్చి చంకలో చేరింది కవిత. ఆమె చెంపను తడిమి చూసాడు వెంకటయ్య, చెంప ఇంకా కొంచెం కంది పోయేవుంది. భార్య దిక్కు కోపంగా అసహ్యంగా చూసాడు వెంకటయ్య. లేచి టీ పెట్టడానికి ఇంట్లోకి పోబోయింది విమల.

"అమ్మాయి నెందుకు కొట్టావు?" విమల దగ్గరికి వెళ్ళి అడిగాడు...

"ఆ విషయం మీరింకా మరిచి పోలేదా...?" అంటూ వంటింట్లోకి వెళ్ళింది విమల...

"నే నడిగిందానికది సమాధానం కాదు..." కోపంగా అన్నాడు వెంకటయ్య టీ పాత్రలో నీళ్ళు, టీ పౌడర్ వేసి స్టౌపై పెట్టింది విమల...

"వర్తిగనే కొట్టాను... దాని కింద రాద్ధాంత మెందుకు...?" అంది...


"వర్తిగనే కొట్టడ మెందుకు? చేతుల తీటా?"

విమలేం మాట్లాడలేదు...

"నీ కళ్ళు నెత్తి కెక్కు తున్నాయి... నా మాటంటే లక్ష్యం పెట్టడం లేదు... ఏం చూసుకొనంత పొగరు నీకు...?"

టీ గిన్నెలో నీళ్ళు, పౌడర్ మరుగుతున్నాయి.

విమల ఏం మాట్లాడకుండా భర్తనోసారి చూసి




నవ్వి ఊరుకుంది...

మరింత రెచ్చి పోయాడు వెంకటయ్య...

"నీకు పిల్లల నెలా పెంచాలో తెలియదు... భర్త నెలా గౌరవించాలో తెలియదు... మెట్రిక్ కూడా చదవని, సంస్కారం లేని బ్రూట్‌వి, నువ్వు నువ్వో పశువ్వి..." అన్నాడు వెంకటయ్య కసిగా

మరుగుతున్న నీళ్ళలో పాలు పోసి, పంచదార వేసి భర్త దిక్కు చూసింది విమల, ఆమె ముఖంలో బాధ.

"నేను రాక్షసిని... పశువును... పొగరు బోతును... ఇంకేమైనా తిట్టేదుందా...??" అంది విమల

"ఎన్ని తిట్టినా పడతావు కానీ అమ్మాయి నెందుకు కొట్టావో చెప్పమంటే చెప్పవు... అంతేనా...?" అన్నాడు వెంకటయ్య.

"నా బిడ్డపై నేను చెయ్యి వేయడం కూడా తప్పేనా?" అంది స్టౌ ఆర్పి గిన్నె కింద బెడుతూ విమల...

"పిల్లలను కొట్టొద్దని నేనడం లేదు... పసిదాన్ని చెంప వాచేలా కొడితేనే శిక్షించినట్టా...? అంత దెబ్బ కొట్టడాని కమ్మాయి చేసిన తప్పేంటి...? అంత క్షమించరాని నేరం చేసిందా బేబీ...?"

భర్త మాటలు వింటూ రెండు కప్పుల్లో టీ పోసి, వాట్నే తీసుకొని ముందు గదిలో కెళ్ళింది విమల... రెండు కప్పులను టీ పాయ్ పై పెట్టింది. ఆమె వెనకే వెంకటయ్య వెళ్ళాడు. తన మాటలకు జవాబు రాకపోయే సరికి వెంకటయ్య మరింత కోపమొచ్చింది.

"తల్లిగారింటికాన్నుంచి ఏం తెచ్చుకునే తెలివి లేకున్నా, ఒక్క రూపాయి సంపాదించే తెలివి తేటల్లేకున్నా కళ్ళు నెత్తిమీదున్నాయి...

నేనడిగిందానికి సమాధానం చెప్పవెందుకు..." కసురుకుంటూ అన్నాడు...

"ఏ తల్లిదండ్రులైనా పిల్లలనెందుకు కొడ్తారు...? పసిదాన్ని కొట్టినందుకు మీరెందుకింత పట్టుబడుతున్నారు...? ముందు టీ తాగండి... తర్వాత చెబుతాను గాని..." అంది విమల కుర్చీలో కూర్చొని టీ కప్పు చేతిలోకి తీసుకుంటూ...

"టీ తర్వాత... ముందు చెప్పు..." ఆమె కెదురుగా కూర్చుంటూ కోపంగా అన్నాడు వెంకటయ్య...

"చెప్పక తప్పదంటారా...?" అంది టీపాయ్‌పై కప్పు పెడుతూ విమల...

"చెప్పమనేగా నేను మొత్తుకుంటున్నది..." మరింత కోపంగా అన్నాడు వెంకటయ్య...

"అయితే వినండి... ఇంట్లో వున్న రెండు కోడిగుడ్లతో పులుసు పెట్టి కూర వండాను... చెరి సగం గుడ్డుతో ఇద్దరుపిల్లలకు అన్నం తినిపించాను... మీ కోసమనుంచిన కోడిగుడ్డును నాకు తెలియకుండా అమ్మాయి తినేసింది... కోపమాగక కొట్టాను... ఆవేశంలో అంత గట్టిగా తగులుతుందనుకోలేదు..." అని ఎవరు ఎవర్ని అర్థం చేసుకోలేదో మీరే తేల్చుకొండన్నట్టు చూసి టీ కప్పు తీసుకొని వంటింట్లోకి వెళ్ళింది విమల...

ఆ మాటలు విన్న వెంకటయ్య ముఖం మాడి పోయింది... ముఖంలో ఆశ్చర్యం! ఆ మాటల్లో ఎన్నో అర్థాలు, ఎన్నో భావాలు స్ఫురించాయతనికి... అతని కళ్ళముందెన్నో ఘట్టాలు కదిలాయి. చిన్న గిన్నెల్లో దాచిన కూరలను తాను అన్నం తినేప్పుడు తన కంచంలో వేయడం లాంటివి జ్ఞాపకం వచ్చాయి... విమల ఔన్నత్యం ముందు తాను మరుగుజ్జుగా కనబడుతున్నాడు. తాను 'బ్రూట్' అని తిట్టిన తన భార్య జీవితాన్నెంత బాగా అర్థం చేసుకొని ప్రవర్తిస్తుందో ఆతని ఆలోచనకే అందడం లేదు. విమలను తప్పుగా అర్థం చేసుకున్నందుకు తనను తానే నిందించుకున్నాడు... రెండు కోడి గుడ్లలో ఒకటి పిల్లలక్కూమరొకటి తనకూ...? మరి విమలేం తింటుంది...?

విమలపై చెప్పలేని ఆరాధనా భావం పెరుగుతుండగా తలవంచుకొని మెల్లమెల్లగా టీ చప్పరించాడు... బట్టలు మార్చుకున్నాడు... బయట కెళ్ళాడు... పార్కు కెళ్ళి కొంతసేపు కూర్చున్నాడు... లైబ్రరీ కెళ్ళి కొంతసేపు కూర్చున్నాడు... కాని ఎక్కడున్నా విమలన్న 'మీ కోసం దాచిన కోడిగుడ్డును తింటే కవితను కొట్టాను' అన్న మాటలే అతన్ని వెంటాడుతున్నాయి... తాను విమలను తిట్టిన తిట్లు జ్ఞాపకం వస్తున్నాయి... రాత్రి వరకూ తిరిగి ఇంటికెళ్ళాడు. తన కొరకు ఆదుర్దాగా ఎదురు చూస్తున్న విమలనారాధనగా చూశాడు. మౌనంగా కూర్చొని భోజనం చేశాడు... భోజనం చేసి వంటిల్లు సర్ది వచ్చిన విమలను దగ్గర కూర్చోబెట్టుకున్నాడు... పిల్లలు నిద్రపోతున్నారు...

"విమలా! నా కోసం కోడిగుడ్డు దాయడ మెందుకు...?" తెలిసీ అడిగాడు వెంకటయ్య...

"మీరు బలహీనంగా వున్నారని డాక్టర్ చెప్పాడు... ఇంట్లో సంపాదించేది మీరొక్కరే... మీరుద్యోగం మాత్రమే కాకుండా ఇంట్లో వున్నప్పుడు బట్టల దుకాణం అకౌంట్సవీ చూసి మరికొంత సంపాదిస్తున్నారు... అయినా ఆదాయం బొటాబొటిగానే వుంది... మనకున్న ఆర్థిక పరిస్థితుల్లో ఇంట్లోని వ్యక్తులందరూ పూటకో కోడిగుడ్డు తినడం సాధ్యమవుతుందా...? వున్న దాంట్లో మీకొంచెం మంచి ఆహారమివ్వాలని..." తల వంచుకొని అంది విమల...

విమలనాప్యాయంగా దగ్గరకు తీసుకున్నాడు వెంకటయ్య... ఉదయం తనకూపిల్లలకూపాలు ఇచ్చి విమల టీ తాగుతుంది... పాలు తాగమంటే తనకు పాలు ఇష్టం లేదంటుంది... అంటే విమల వున్న దాంట్లో తనకూ పిల్లలకూ మంచి ఆహారం పెడుతుంది. మరి తనేం తింటుంది...?

తనతో కూచొని అన్నం తినమంటే చాలాసార్లు

రాజమండ్రి జెసీరెట్స్ వారి పోటీలో రూ.250/- లు ప్రథమ బహుమతి పొందిన ఫోటో



ఏదో సాకు చెప్పి ఎందుకు తప్పించుకుంటుందో ఇప్పుడర్థమైందతనికి... వున్న కూరలు తనకు పెట్టి ఏ 'పచ్చడితోనో' కడుపు నింపుకుంటుందన్నమాట! వెంకటయ్య హృదయం భారమయింది...

"విమలా! నువ్విలా చేయడం బాగాలేదు... కష్టమైనా, సుఖమైనా జీవితమన్న తర్వాత చెరి సగం పంచుకోవాలి... రెండుంటే చెరొకటి తినాలి... ఒక్కటుంటే చెరి సగం తినాలి... నువ్వు తినకుండా నాకుంచడం సరైంది కాదు..." అన్నాడు. వెంకటయ్య...

"ఈ రోజు మీకేమయింది...? చిన్న విషయాలకు పెద్దగా ఆలోచిస్తున్నారు... ఇందులో గొప్ప విషయమేముంది...? నా భర్త కోసం, నా పిల్లల కోసం, నా సంసారం కోసం వున్న దానితో కడుపు నింపుకోవడమో పెద్ద విషయం కాదు... స్త్రీకి తన తిండి ముఖ్యం కాదు... తన సంసారం ముఖ్యం... చాలా రాత్రయింది... నాకు నిద్రొస్తుంది... మీరు పడుకోండి. ఆలోచిస్తూ మనసుపాడు చేసుకోకండి..." అతి మామూలుగా అని భర్త పట్టుబిగించి విడిపించుకొని మంచంలో ఒరిగింది విమల...

"విమలా! ఈ రోజు నాకెన్నో జీవిత సత్యాలు తెలిసాయి... ఇక నుంచి నువ్వు నాతోనే భోజనం చెయ్యాలి... పిల్లలకు పెట్టగా మిగిలిందాంట్లో ఏమున్నా చెరిసగం... అర్థమయిందా...?" అన్నాడు భార్య మీద చెయ్యేస్తూ వెంకటయ్య...

తను చేసిన గొప్ప పనేంటో విమలకర్థం కాలేదు... ఆ విషయాలను చాలా మామూలుగా, గృహిణి ధర్మంగా భావించింది... భావావేశంలో వున్న భర్తను నిరుత్సాహపరచడం ఇష్టం లేక.

"సరే అలాగే కానిద్దాం... మీరు పడుకోండి..." అని నిద్రలో కొరిగింది.

విమలనొదిలి వచ్చి తన మంచంలో పడుకున్నాడు వెంకటయ్య... ఎంత ప్రయత్నించినా అతనికి నిద్ర రావడం లేదు... అతని మది నిండా ఎన్నో ఆలోచనలు...

"జీవితాన్నెంత బాగా అర్థం చేసుకుంది విమల... పరిస్థితులనెంత బాగా అవగాహన చేసుకుంది...! అలాంటి విమలను తాను తప్పుగా అర్థం చేసుకున్నాడు. ఆకాశమంత ఎత్తున వున్న భార్యను అల్పురాలని నిందించాడు... ఆమె ముందు తానెంత మరుగుజ్జు...? స్త్రీలంతా ఇలాగే వుంటారా...? అంతా తన విమలలే అయితే ఎన్నో సంసారాలెందుకు బజారుకెక్కుతాయి...?

రకరకాలుగా ఆలోచించాడు వెంకటయ్య.. స్త్రీలంతా విమలలాగే వుండకున్నా భారతీయ సమాజంలో 'పరంపర'గా స్త్రీకేదో సంక్రమిస్తున్నట్టు అర్థమవుతోందతనికి... విమలలో వెంకటయ్యకాతని తల్లి కనబడుతోంది... వెంకటయ్య తల్లి చలిది తింటూ భర్తకు వేడన్నం పెట్టేది... తాను మాడింది తింటూ భర్తకు మంచన్నం పెట్టేది... తాను పాచిపోయిన కూరలు తింటూ భర్తకు తాజావి పెట్టేది... తాను కారంతో తింటూ ఉన్న శాకర భర్తకు పెట్టేది. ఉన్న దాంట్లో మంచిది భర్తకు పెట్టేది... పసివాడయిన వెంకటయ్య ఇవన్నీ గమనించి ఓసారి తల్లినడిగాడు... ఆ రోజామె సరిగ్గా ఈ రోజు విమల చెప్పిన సమాధానమే చెప్పింది... తల్లి జ్ఞాపకాలతో కూడిన గతమంతా మదిలో మెదిలిందతనికి... తన బాల్యం, తండ్రి చనిపోయినా తల్లి చదివించడం... కొడుకుకొరకు కొంతైనా ఆస్తి సంపాదించాలని ఆరాటపడడం అన్నీ జ్ఞాపకం వచ్చాయి వెంకటయ్యకు...

'అమ్మా! నువ్వెంత ఆరాటపడినా, కష్టపడినా వారసత్వ సంపదగా ఆస్తిపాస్తులేం ఇవ్వలేక పోయావు... కాని, సంస్కారవంతురాలైన కోడల్ని, నీ పరంపరను మోస్తున్న మంచి భార్యనిచ్చావమ్మా...' తనలో తానే అనుకున్నాడు వెంకటయ్య...

విమల దగ్గరికెళ్ళి ప్రశాంతంగా నిద్రపోతున్న ఆమెనాప్యాయంగా తాకి నుదుటిపై ముద్దు పెట్టుకున్నాడు.

స్త్రీకి తరతరాలుగా సంక్రమిస్తున్న పరంపర గొప్పదే. కానీ, ప్రపంచంలో సగమై పురుషుడితో సమానంగా చూడబడాల్సిన స్త్రీపై సంప్రదాయం పరంపర పేరిట పురుషాధిక్యత కొనసాగుతోందని మధ్యతరగతి సంస్కారాన్ని జీర్ణించుకున్న వెంకటయ్య ఆలోచనకు తట్టనే లేదు...

రాజమండ్రి జెసీరెట్స్ వారి పోటీలో రూ.250/- లు ప్రథమ బహుమతి పొందిన కార్టూన్




బహుమతులు అందచేస్తున్నవారు:

చందన కంచి శారీస్ - లేడీస్ అండ్ జంట్స్ షోరూమ్

కోటగుమ్మం దగ్గర, రాజమండ్రి■